రైతుబజార్‌కు పార్కింగ్ సమస్య

- పెదవాల్తేరు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేత
- తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్



బజార్ లోపల కేటాయించిన పార్కింగ్ స్థలం



పెదవాల్తేరు రైతు బజార్



రైతుబజార్ ఎదుట రోడ్డుపై నిలిపిన వాహనాలు

ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరు రైతుబజార్‌కు నిత్యం పార్కింగ్ సమస్య ఎదురవుతోంది. వినియోగదారులు సంఖ్య పెరగడం, తగినంత పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీంతో నిత్యం ఈ రహదారిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం వేళల్లో 7 నుంచి 10 గంటల వరకు పెదవాల్తేరు రైతుబజార్‌కు వినియోగదారుల తాకిడి ఉంటోంది. వందలాది మంది వినియోగదారులు బజార్‌కు రావడంతో లోపల ఉన్న పార్కింగ్ స్థలం సరిపోవడం లేదు. పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ వినియోగదారులు ఇక్కడ వాహనాలను నిలపడానికి కొంత నిరాసక్తత కూడా చూపుతున్నారు. దీనికి కారణం పార్కింగ్ రుసుము వసూలు చేయడమేనన్న వాదన వినిపిస్తోంది. దీంతో అధిక శాతం మంది వినియోగదారులు తమ వాహనాలను రైతుబజార్ బయట రోడ్డుపై ఉంచి కూరగాయలు కొనుగోలు చేయడానికి వెళ్తున్నారు. కొన్ని సందర్భాలలో రహదారిపై రెండు వరుసల్లో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఇటువంటి సమయంలో రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పండగ సమయాల్లో ఈ రద్దీ మరింత ఎక్కువవుతోంది. పక్కనే ఉన్న మూడో పట్టణ పోలీసు స్టేషన్ వరకు వాహనాలు నిలిపివేస్తున్నారు.

మరోవైపు రైతుబజార్‌కు ఆనుకుని పలు పండ్ల దుకాణాలు, టిఫిన్ షాపులు వెలిశాయి. వీటికి వచ్చే వినియోగదారులు సైతం తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. కనీసం రైతుబజార్‌కు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను లోపల నిర్దేశించిన పార్కింగ్ స్థలంలో నిలిపితే కొంత వరకు ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ఉంటుంది. రైతుబజార్ అధికారులు దీనిపై దృష్టిసారించి వినియోగదారులు తమ వాహనాలు నిర్దేశిత పార్కింగ్ స్థలంలో మాత్రమే నిలిపేలా చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

పోలీసుల దృష్టికి తీసుకెళ్లాం..



రైతుబజార్‌కు వచ్చే వినియోగదారులు తమ వాహనాలకు రైతుబజార్ ప్రాంగణంలో ఉన్న పార్కింగ్ స్థలంలో మాత్రమే నిలపాలని సూచిస్తు న్నాం. గతంలో పార్కింగ్ ఫీజు లేని సమయంలో రైతుబజార్ ప్రాంగణంలోనే వాహనాలను నిలిపేవారు. ప్రస్తుతం వాహనాలు అధికంగా బయట వదిలేస్తున్నారు. పోలీసుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాం.

– వరలక్ష్మి, ఈవో, పెదవాల్తేరు రైతుబజార్

క్లుప్తంగా

అదనపు నిధుల కోసం సంతకాల సేకరణ

ఆరిలోవ: జగనన్న ఇళ్ల కాలనీకి అదనంగా నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఐ శుక్రవారం లబ్ధిదారుల నుంచి సంతకాలు సేకరించింది. సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రాంతం అంబేడ్కర్ కూడలి వద్ద సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కాలనీలలో వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. నిధులు పెంచాలని కోరుతూ జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో కలసి వచ్చేనెల 6న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేతలకు అభినందన

ఎంవీపీ కాలనీ: ఆలిండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను సమత కళాశాల కరస్పాండెంట్ విజయరవీంద్ర అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పురుషుల జట్టు ఇటీవల జరిగిన ఈ పోటీల్లో 3వ స్థానంలో సాధించిన విషయం తెలిసిందే. ఈ జట్టుకు ఎంవీపీ కాలనీలోని సమత కళాశాల క్రీడాకారుడు జి.వీర్రాజు సారథ్యం వహించగా.. కళాశాలకు చెందిన పి.యజ్ఞసాయి, జె.రవి, పి.గోపీకృష్ణ టీం సభ్యులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా విజయరవీంద్ర ఆయా క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

'హెర్నియా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు'

ఆరిలోవ: హెర్నియా సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దని అపోలో లేప్రోస్కోపిక్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ కిశోర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని వల్ల గజ్జల్లో వాపు, ముందుకు వంగినప్పుడు, బరువు ఎత్తినప్పుడు నొప్పి రావడం, కడుపులో నొప్పి, బలహీనత, అసౌకర్యంగా ఉంటుందన్నారు. ఆయా లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. స్కానింగ్ ద్వారా హెర్నియాను గుర్తించాలన్నారు. ఈ స్కానింగ్ ఆదివారం అపోలోలో రూ.499కే చేస్తామని తెలిపారు. అనంతరం వైద్యుడితో ఉచితంగా కన్సల్టెన్సీ ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైన వారు హెల్త్ సిటీ అపోలోలో సంప్రదించాలన్నారు.

సీఐ దృష్టికి 12వ వార్డులో ఆకతాయిల సమస్య

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం 12వ వార్డులో ఆకతాయిల సమస్యను సీఐ సోమశేఖర్ దృష్టికి వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి తీసుకెళ్లారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఆయనను శుక్రవారం కార్పొరేటర్ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వార్డులో ఆకతాయి లు, మత్తు పదార్థాలు సేవించేవారు ఎక్కువగా ఉన్నారన్నారు. ఆ మత్తులో అల్లర్లకు దిగుతున్నారని చెప్పారు. దీని వల్ల వార్డులో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, దృష్టి పెట్టాలని ఆమె కోరారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న మనోజ్ మృతదేహం

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్రిపాలెం ఎఫ్‌సీఐ గొడౌన్ దగ్గరలో ఒక వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం అర్ధరాత్రి దాటా క జరిగింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి పేరు మనోజ్ అని, సుమారు 29 ఏళ్ల వయసు ఉండొచ్చని, ఉత్తరాది ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా పోలీసులు చెబుతున్నారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్, ఇతర వస్తువులు ఏరుకుంటూ వాటిని స్క్రాప్ దుకాణాలకు విక్రయించగా వచ్చిన డబ్బులతో మద్యం తాగుతుండేవాడని స్థానికులు తెలియజేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఎస్.వి జయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ రవికిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాల వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఈ నెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బాలికలపై నేరాలను నివారిద్దాం–నిర్భయంగా జీవించనిద్దాం' అంశంపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలికలు, మహిళలు స్వేచ్ఛగా జీవించే సమాజం అవసరమన్నారు. వారి హక్కు లకు, మనోభావాలకు భంగం కలగకుండా సహకరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ దిశగా సమాజంలో అవగాహన పెంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. గత నెల భీమిలిలో జరిగిన స్కూల్ గేమ్స్ విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి నెట్ బాల్ క్రీడల్లో అండర్ -14 బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో, అండర్ – 17 బాయ్స్ విభాగంలో తృతీయ స్థానం సాధించారు. దీంతో ఈ పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. వీరంతా ఈ నెల 21, 22, 23 నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి నెట్ బాల్‌లో పాల్గొననున్నట్లు చెప్పారు.

విదేశీ వర్సిటీల అనుమతిపై నిరసన



కృష్ణా కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌వో సభ్యులు

మద్దిలపాలెం: దేశంలో విదేశీ యూనివర్సిటీల అనుమతికి సంబంధించి యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌వో ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణా కళాశాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ద్వారం వద్ద విద్యార్థులు నినాదాలు చేశారు. పీడీఎస్‌వో నాయకుడు భాను మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా దేశంలోకి విదేశీ విశ్వవిద్యాలయాలు, విదేశీ ఉన్నత విద్య సంస్థలు ప్రవేశానికి అనుమతి ఇస్తున్నట్టు యూజీసీ ఈనెల 5న ప్రకటించిందన్నారు. విదేశీ విద్యా సంస్థలు లాభాపేక్షతోనే ఉంటాయన్నారు. ఆయా దేశాల పారిశ్రామిక రంగాల అభివృద్ధికి అనుగుణంగా ఇక్కడి మానవ వనరులు సేకరణకు చేస్తున్న ప్రయత్నమేనని ఆయన చెప్పారు. దీన్ని ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.విశ్వనాథ్, నాయకులు లక్ష్మి, చరిష్మా, మోహన్, చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'బురద జల్లితే సహించం'

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంపైన ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు బురద జల్లుడు కార్యక్రమం ఆపకపోతే తామూ అంతే స్థాయిలో స్పందించవలసి వస్తుందని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పీజే జవహర్, జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ, కార్యదర్శి బీవీఎస్ రవిశంకర్ హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటం చేస్తామని జవహర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎన్‌జీవో సంఘం నాయకులు వారికి ప్రభుత్వం కేటాయించిన భవనాలను వ్యాపార కేంద్రాలుగా మార్చి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి జమా ఖర్చులు కూడా చూపించడం లేదని అన్నారు. ఈ విషయం అడిగినందుకు తమపై ఎదురు దాడి చేస్తున్నారని అన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో 'బుల్లయ్య' విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఏవీఎన్ కాలేజీలో ముగిసిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషుల నెట్ బాల్ టోర్నమెంట్‌లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం వారిని బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించి క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి విద్యార్థులను అభినందించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవోతో పాటు, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కళింగుల ఆత్మీయ కలయికకు ఏర్పాట్లు



ఆహ్వాన పత్రిక అందిస్తున్న పేడాడ రమణికుమారి

మద్రిపాలెం: మాధవధార మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 29న కళింగుల ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్టు నిర్వాహకురాలు, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళింగ కుటుంబ సభ్యులను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. కళింగ బృందంతో కలిసి మాధవధారలో ఆమె పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు.

రైళ్ల పరిశుభ్రతకు సహకరించండి

- ప్రయాణికులకు డీఆర్ఎం విజ్ఞప్తి



డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైళ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సహకరించాలని, ఇది అందరి బాధ్య తని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్న వందేభారత్ రైలును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడా రు. ఎప్పటికప్పుడు హౌస్‌కీపింగ్ సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నా కూడా విశాఖకు చేరేసరికి పలు కోచ్‌ల నిండా ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్ కప్స్, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేసి ఉన్నాయని చెప్పారు. పరిస్థితిని చూసిన డీఆర్ఎం స్పందిస్తూ డోంట్ బీ బిట్టర్–స్టాప్ ద లిట్టర్ అని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశా రు. ప్రతిష్టాత్మక వందేభారత్ రైలు శుభ్రంగా ఉంచాలని, దీనికోసం డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారని తెలిపారు.

బస్సును ఢీకొట్టిన లారీ



ట్రాఫిక్ ఐలెండ్‌పైకి దూసుకెళ్లిన బస్సు

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సును తాటిచెట్ల పాలెం వద్ద లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. వివరాలిలా.. అక్కయ్యపాలెం నుంచి ఎన్ఏడీ వైపు వెళ్తున్న ఒక లారీ.. ఊర్వశి జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్తున్న బస్సును ఢీకొంది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు లారీని తప్పించబోయి, రోడ్డు మధ్యలో గల ట్రాఫిక్ ఐలెండ్‌పైకి దూసుకుపోయింది. దీంతో ఐలెండ్ ధ్వంసం కాగా.. బస్సు డ్రైవర్‌కు, లోపల ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కంచరపాలెం పోలీసులు, 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. కంచరపాలెం పోలీసులు పరిస్థితిని సమీక్షించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వీసీటీపీఎల్ భద్రతా సిబ్బంది

తాటిచెట్లపాలెం: రహదారులపై ప్రయాణించేటపుడు వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వీసీటీపీఎల్ సేఫ్టీ విభాగం సిబ్బంది సూచించారు. ఈమేరకు శుక్రవారం రైల్వే న్యూకాలనీ, స్టేషన్ రోడ్ జంక్షన్ల వద్ద రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు విధిగా సీట్‌బెల్ట్ ధరించాలని సిగ్నల్ పాయింట్ల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ, స్లోగన్‌ల ద్వారా తెలియజేశారు. ప్రజలంతా నిబంధనలు పాటించి ప్రమాద రహిత విశాఖకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీరి ప్రయత్నానికి ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు సంఘీభావం తెలిపి కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్నతో మహిళలకు సముచిత స్థానం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని
- 21వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజలకు పథకాల కోసం వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

బీచ్ రోడ్డు: మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు వారికి అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 21వ వార్డులోని ఏయూ అవుట్ గేట్ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ చేయూత, ఆసరా, జగనన్న తోడు, అమ్మ ఒడి వంటి పథకాలను అమలు చేసి మహిళలకు అండగా సీఎం వైఎస్ జగన్ నిలుస్తున్నారన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాల అమలుతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణను తట్టుకోలేక చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అయినా ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రసాదుల భాగ్యానంద్, మధుపాడ రవికుమార్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'బాబుకు మేలు చేయడమే రామోజీ అజెండా'

ఎంవీపీ కాలనీ: టీడీపీకి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎలా మేలు చేయాలన్నదే ఈనాడు అధినేత రామోజీరావు అజెండా అని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు రాతలు రాయడాన్ని ఆమె ఖండించారు. వలంటీర్లు అంటే రామోజీరావుకు ఎందుకంత భయమని ప్రశ్నించారు. గతంలో టీడీపీ నియమించిన జన్మభూమి కమిటీలను ఏనాడు తప్పుబట్టని ఈనాడు దినపత్రిక ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థను ఎందుకు తప్పుబడుతుందని నిలదీశారు. జన్మభూమి కమిటీలు ప్రజలను మోసం చేసి డబ్బులు దండుకుంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన వలంటీర్ వ్యవస్థ సంక్షేమాన్ని ఇంటింటికి అందజేస్తుందన్నారు. రామోజీరావు ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణను అడ్డుకోలేరన్నారు. ఈనాడు పత్రికను చంద్రనాడుగా మార్చొద్దని ఆమె హితవు పలికారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



విద్యార్థినికి అవగాహన కల్పిస్తున్న అధికారి ఉమాదేవి

ఏయూ క్యాంపస్: అవగాహన, అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వాణిజ్య అధికారి ఎం.బి ఉమాదేవి చెప్పారు. శుక్రవారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో విద్యార్థులకు ఇంట్లో గ్యాస్‌స్టవ్ వినియోగం–తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ స్టవ్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న పొరపాటు జరిగినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సంస్థ ప్రాంతీయ అధికారి జోషి మాట్లాడుతూ ప్రమాదానికి దారితీసే సందర్భాలు, కారణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తేజ, మనోరమ, సూర్యారావు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె



ఎల్ఐసీ సెంట్రల్ బ్యాంకు వద్ద నిరసన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

డాబాగార్డెన్స్ : యునైటెడ్ ఫోరమ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం బ్యాంక్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఎల్ఐసీ బిల్డింగ్ సెంట్రల్ బ్యాంక్ వద్ద కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమన్వయ సంఘం ప్రతినిధులు ఆర్‌వీ రవికుమార్, వి. కమలాకర్, వి. రమేష్ మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని, కొన్ని సవరణలతో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలన్నారు. 12వ ద్వైపాక్షిక వేతన సవరణ ఒప్పందం అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. 11వ వేతన సవరణలో అమలు కాకుండా ఉన్న న్యాయమైన డిమాండ్ల పట్ల సానుకూలంగా ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నెల 30, 31 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్టు తెలిపారు. పి. ఈశ్వరరావు, టి. రాజు, బి. రామారెడ్డి, జి. సూర్యలక్ష్మి, ఎస్. అనూషభాను, కెఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల వల్లే ఆర్థిక ప్రగతి




కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న రామారావు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల వల్లే దేశంలోని ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 708వ రోజు, శుక్రవారం సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఈడీ కార్మికులు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు ఎస్. రామారావు మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదన్నారు. దళితులు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, రాయితీలను సమసమాజ స్థాపనకు ఉపయోగపడే విధంగా చేస్తామని ప్రమాణం చేసిన కేంద్ర ప్రభుత్వం నేడు కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికే వరకు వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తూనే ఉంటామన్నారు. శిబిరంలో వివిధ విభాగాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

గాంధీ అధ్యయన కేంద్రం సందర్శన



రావుకు జ్ఞాపిక బహూకరిస్తున్న చల్లా రామకృష్ణ

ఏయూ క్యాంపస్: జపాన్‌కు చెందిన శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త డాక్టర్ ఎస్‌వీఎస్ రావు శుక్రవారం ఏయూలోని గాంధీ అధ్యయన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ జపనీయులు గాంధీజీ పని సంస్కృతిని అనుసరిస్తారని చెప్పారు. విద్యార్థుల్లో గాంధేయ ఆలోచనలు, సిద్ధాంతాలను ప్రోత్సహిస్తున్న వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డిని అభినందించారు. మహాత్మా గాంధీపై ఫారినర్స్ వ్యూస్ అనే పుస్తకాన్ని డాక్టర్ రావుకు గాంధీయన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.కిషోర్ కుమార్, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ పాల్గొన్నారు.